క్లుప్తంగా

పోలీసుల కార్డెన్‌సెర్చ్



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి అనుబంధ గ్రామమైన రాజాపురంలో బుధవారం అంతర్గాం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా సైబర్ మోసాలు, బాల్య వివాహాలు, మహిళలపై నేరాలు, రోడ్డు ప్రమాదాలు, సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాధాన్యత, మాదక ద్రవ్యాల వినియోగంపై వివరించారు. ట్రాఫిక్ నిబంధనలకు లోబడి డ్రైవింగ్ చేయాలని సూచించారు. 28 మందికి చెందిన వాహనాల ధృవీకరణ పత్రాలు పరిశీలించారు. రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, అంతర్గాం ఎస్సై బోయ వెంకటస్వామి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న రిటైర్డ్ హెచ్చెం

సుల్తానాబాద్: పట్టణంలోని పూసాలకు చెందిన వెంగళ హర్షిత ఉన్నత చదువుల కోసం రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అల్లం భాగ్యలక్ష్మి-సత్యనారాయణ దంపతులు రూ.10వేలు అందజేశారు. తల్లిదండ్రులు లేని హర్షిత మిర్యాలగూడలోని జేఎన్టీయూసీలో ఇంజినీరింగ్ సీటు రావడంతో చదవుకోవడానికి దాతలు ముందుకు రావాలని పలువురు కోరుతున్నారు. హర్షితకు సాయం అందించాలనుకునే వారు గూగుల్‌పే, ఫోన్ పే నంబర్ 83097 78260కు నగదు పంపించి ఆదుకోవాలని కోరారు. పూసాలకు చెందిన వడ్లూల రమేశ్, వెంగళ స్రవంతి, రమేశ్ ఉన్నారు.

చెట్లపొదలు తొలగించారు



సాక్షి ఎఫెక్ట్..

కమాన్‌పూర్: మండల కేంద్రం నుంచి పిల్లిపల్లె మీదుగా గుండారం, మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిపై ఉన్న మూలమలుపులతో పాటు రహదారి వెంట ఉన్న చెట్లపొదలను పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ గురువారం ట్రాక్టర్‌తో తొలగించారు. మూలమలుపుల వద్ద ప్రమాదకరంగా ఉన్న చెట్లపొదలపై సాక్షి దినపత్రిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన కార్యదర్శి ట్రాక్టర్‌తో చెట్ల పొదలను తొలగించారు. వాహనదారులు, స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థికి అభినందనలు



అభినందిస్తున్న కరస్పాండెంట్, ఎండీ

ధర్మారం: మండల కేంద్రంలోని సాయిమణికంఠ హైస్కూల్ విద్యార్థి దీపిక రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. జట్టు ద్వితీయ స్థానం పొందడంలో కీలకపాత్ర పోషించిన దీపికను పాఠశాల ఎండీ జైన రమాదేవి, కరస్పాండెంట్ సురేశ్‌కుమార్ అభినందించారు. ఇటీవల నారాయణపేట జిల్లా కోస్గిలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు నుంచి పాల్గొని ప్రతిభ కనబరిచింది.

ఢిల్లీ మహాధర్నాలో పెద్దపల్లి నేతలు



ఢిల్లీలోని ధర్నాలో పాల్గొన్న నాయకులు

పెద్దపల్లిరూరల్: దేశంలో విచ్చలవిడి మత్తు పదార్థాలతో యువత నిర్వీర్యం అవుతోందని, అందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణమంటూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమంలో పెద్దపల్లి నేతలు పాల్గొన్నారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ధర్నా కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు బండారి సునీల్‌గౌడ్, గంగుల సంతోష్, అనిల్‌యాదవ్, అడప సతీశ్, అభిలాష్, కుమార్‌యాదవ్, భరత్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

- ఉపయోగించకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్న వైనం
- అద్దె భవనాల్లో గ్రంథాలయం, వ్యవసాయశాఖ కార్యాలయాలు
- మరమ్మతు చేసి వినియోగంలోకి తేవాలని విన్నపం



శిథిలమవుతున్న పక్కా భవనాలు



భవనం ఆవరణలో మందుబాబులు తాగి పడేసిన మద్యం సీసాలు (ఫైల్)

జూలపల్లి: లక్షలు వెచ్చించి నిర్మించిన పక్కా భవనాలు వాడకం లేక, అధికారులు పట్టించుకోక శిథిలావస్థకు చేరుతున్నాయి. భవనాలు లేవన్న సాకుతో నేటికీ గ్రంథాలయం, మండల వ్యవసాయ కార్యాలయం అద్దె భవనాల్లో కొనసాగించడం విమర్శలకు తావిస్తోంది. మండల కేంద్రంలో 30ఏళ్ల క్రితం నిర్మించిన భవనాల్లో ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహణకు ఈ భవనాలను వాడుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలన్న లక్ష్యంతో పదేళ్ల క్రితం ఎంపీడీవో, ఐదేళ్ల క్రితం తహసీల్దారు కార్యాలయాలు నిర్మించగా, నాలుగేళ్ల క్రితం జూనియర్ కళాశాలకు నూతన బిల్డింగ్ నిర్మించి సొంత భవనాల్లోకి కార్యాలయాలను తరలించారు. అప్పటి నుంచి పక్కా భవనాలు ఖాళీగా ఉన్నాయి. ఎవరూ పట్టించుకోక పోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి.

మరమ్మతు చేస్తే మరో పదేళ్లు..

ఖాళీగా ఉన్న మూడు పక్కా భవనాలకు స్వల్ప మరమ్మతు చేస్తే మరో పదేళ్లు ఇతర కార్యాలయాలు కొనసాగించవచ్చు. ఇప్పటికే గ్రంథాలయం, మండల వ్యవసాయ శాఖకు కార్యాలయాలు లేక అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. తమకు స్థలం చాలడం లేదని ఖాళీ చేయాలని పీఏసీఎస్ అధికారులు ఒత్తిడి పెంచినా వాటిల్లోనే కొనసాగిస్తున్నారు. ఖాళీగా ఉన్న భవనాలకు మరమ్మతు చేసి వాడుకోవాలని సూచించినా ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో ఉన్న ఈ భవనాలు ఖాళీగా ఉండడంతో రాత్రయితే మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. పోలీసులు అప్పుడప్పుడు ఆకస్మిక తనిఖీలు చేస్తున్నప్పటికీ పరిస్థితి మారడం లేదని చుట్టుపక్కల ప్రజలు చెప్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలకు మరమ్మతు చేయించి ఇతర కార్యాలయాలకు అప్పగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉపయోగంలోకి తేవాలి



వినియోగంలో లేకపోవడంతో పక్కా భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. మరమ్మతు చేయించి అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాలకు కేటాయించాలి. మరో పదేళ్లు వాడుకోవచ్చు.

– పెంట లచ్చయ్య, జూలపల్లి

గ్రంథాలయానికి కేటాయించాలి



నిరుపయోగంగా ఉన్న భవనాన్ని అద్దె భవనంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి ఇస్తే అందరికీ అందుబాటులో ఉంటుంది. కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు ఆ భవనాన్ని గ్రంథాలయానికి అప్పగించాలి.

– నాడెం మల్లారెడ్డి, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత, జూలపల్లి

మరమ్మతు చేయాలి



కార్యాలయాలు ఖాళీగా ఉండడంతో కిటికీలు, దర్వాజలు దొంగలు ఎత్తుకెళ్లారు. వర్షాలు పడ్డప్పుడు గొర్రెలకు ఆవాసంగా మారుతోంది. అధికారులు మరమ్మతు చేయించి ఇతర కార్యాలయాలకు కేటాయించాలి.

– అమరగాని శ్రీనివాస్, కేసీఆర్ సేవాదళం మండల అధ్యక్షుడు, జూలపల్లి

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

రామగిరి: విద్యుత్ సక్రమంగా సరఫరా చేయడం లేదని, గ్రామంలో విద్యుత్ వైర్లు తెగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని బుధవారం కల్వచర్ల గ్రామస్తులు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. మూడు నెలలుగా తమ గ్రామంలో అప్రకటిత విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయని వారు ఆరోపించారు. కొద్దిపాటి గాలి వీచినా, రాత్రిపూట తరచూ కోతలు విధిస్తూ గ్రామంలో విద్యుత్ సరఫరా కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని, మరమ్మతు పేరుతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. 13ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ వైర్లు తరచూ తెగుతూ కిందపడిపోతున్నా అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నూతన విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసి కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. అధికారులు గ్రామస్తులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. సుమారు 1800 విద్యుత్ కనెక్షన్లు ఉన్న గ్రామంలో విద్యుత్ సిబ్బంది లేకపోవడం గమనార్హం.

సింగిల్‌విండో మాజీ చైర్మన్ మృతితో విషాదం

ఎలిగేడు: మండలంలోని బుర్హాన్‌మియాపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఎలిగేడు సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోదల శ్రీనివాసరెడ్డి(56) మంగళవారం పెద్దపల్లి పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయరమణారావు బుర్హాన్‌మియాపేటకు చేరుకుని శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతిమయాత్రలో పాల్గొన్నారు. పలువురు కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరెడ్డికి నివాళి అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, ఎలిగేడు సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచులు రాచర్ల కొండయ్య, వెంకటేశ్వర్‌రావు, బాలసాని పర్శరాములుగౌడ్, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నేతకు నివాళి

గోదావరిఖని: అకాల మరణం పొందిన ఏఐటీయూసీ నాయకులు మోదుల సంపత్‌కు యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ బుధవారం నివాళి అర్పించారు. మృతదేహంపై ఎర్రజెండా ఉంచి ఆయన యూనియన్‌కు చేసిన సేవలు స్మరించుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

మత్తువైద్యుల సేవలు మరువలేనివి



కేక్ కట్ చేస్తున్న వైద్యులు

కోల్‌సిటీ: మత్తు మందు వైద్య బృందం అందిస్తున్న సేవలు మరువలేనివని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్‌సింగ్, సిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్ అన్నారు. అనస్తీషియా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ కేక్ కట్ చేశారు. ఆస్పత్రిలో జరిగే సర్జరీలు విజయవంతం చేయడంలో అనస్తీషియా డాక్టర్లు ఎంతో బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. అనస్తీషియా హెచ్‌వోడీ డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ బాను, డాక్టర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో పట్టు సాధిద్దాం

పెద్దపల్లిరూరల్: రాబోయే స్థానిక సమరంలో బీజేపీ క్రియాశీల కార్యకర్తలు, నాయకులు అంకిత భావంతో పనిచేసి పట్టు సాధించాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ సభ్యత్వ నమోదుపై ఇన్‌చార్జిలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ బూతులో 200 సభ్యత్వాలు నమోదు చేయించాలని సూచించారు. నాయకులు పోల్సాని సంపత్‌రావు, రాజేశ్వర్‌రావు, వివిధ మండలాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఆధునిక సాంకేతికతతో అధిక దిగుబడి

పెద్దపల్లిరూరల్: వ్యవసాయరంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని ఏసీపీ గజ్జి కృష్ణ అన్నారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌కు చెందిన ఏనుగుల సదయ్య, ఓదెల మండలం ఉప్పరపల్లికి చెందిన రామస్వామికి మంగళవారం పెద్దపల్లిలో జరిగిన కార్యక్రమంలో రాయితీ రుణంపై హార్వెస్టర్లు అందజేశారు. రాజ్‌కుమార్, కుమ్మరి రవి ఉన్నారు.

• హెల్ప్‌లైన్ నంబర్ వినియోగించుకోవాలి

కమాన్‌పూర్: మండల కేంద్రంలో చైల్డ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో మహిళలకు గురువారం అవగాహన కల్పించారు. హెల్ప్‌లైన్ నంబర్ 1098ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఎం శైలజశాంతి, వీవోలు పాల్గొన్నారు.

• టూటౌన్ ఎస్సైగా సోనియా

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ సీఐ ఎస్.ప్రసాద్‌రావు సమక్షంలో ఎస్సైగా అప్సాస్ సోనియా బుధవారం పోలీస్‌స్టేషన్‌లో రిపోర్ట్ చేసి బాధ్యతలు స్వీకరించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సోనియా బదిలీపై గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు రాగా టూటౌన్ సీఐ మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. టూటౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

• ప్రభుత్వ భూములను కాపాడండి

సుల్తానాబాద్: మండలంలోని కనుకుల గ్రామానికి చెందిన సర్వేనంబర్ 288 ప్రభుత్వ భూమిని గుర్తుతెలియని వ్యక్తులు రాత్రివేళ ఆక్రమించుకుని కంచె వేశారని, ఆ భూమిని కాపాడాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి ఆవునూరి సతీశ్‌కుమార్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఆక్రమణకు గురైన భూమి రహదారి పక్కన విలువ గల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని కంచె వేసిన వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. మెరుగు సతీశ్, మారుపాక సురేశ్ ఉన్నారు.

• ఆలయంలో ఉచిత వైద్యశిబిరం

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో కరీంనగర్‌కు చెందిన మెడికవర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచితవైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి ప్రారంభించారు. బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేశారు.

• బైండోవర్ ఉల్లంఘిస్తే జైలు శిక్ష ఖాయం

సుల్తానాబాద్: గుడుంబా తయారీదారులు బైండోవర్ ఉల్లంఘిస్తే ఏడాది జైల్లో ఉండటం ఖాయమని సుల్తానాబాద్ ఎక్సైజ్ సీఐ గురునాథ్ అన్నారు. సుల్తానాబాద్ తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఎదుట బైండోవర్ ఉల్లంఘించిన వారిని నిర్ధారణ కోసం బుధవారం తీసుకువచ్చారు. బైండోవర్ ఉల్లంఘించినందుకు ఒక్కొక్కరికి రూ.లక్ష జరిమానా విధించనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని మార్కండేయ కాలనీకి చెందిన బండారి స్వాతి, శాంతినగర్‌కు చెందిన కోట స్వరూపను కరీంనగర్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

• రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలి

ఓదెల: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఐకేపీ సెంటర్లకు రైతులు తరలించే ధాన్యం నాణ్యత ప్రమాణాలకు కట్టుబడి ఉండాలని డీసీఎం తిరుపతి పేర్కొన్నారు. ఓదెలలో ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల సెంటర్ల వారికి గురువారం శిక్షణ ఇచ్చారు. ఏ గ్రేడు ధాన్యానికి రూ.2320, కామన్ గ్రేడ్ ధాన్యం రకానికి రూ.2300 మద్దతు ధర ఉంటుందన్నారు. ఏపీఎం లత మంగేశ్వరి పాల్గొన్నారు.

• మాజీ ఎంపీటీసీకి పరామర్శ

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంట మాజీ ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశ్‌యాదవ్ తల్లి భీమమ్మ ఇటీవల మృతి చెందారు. కాగా పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మల్లేశ్ కుటుంబాన్ని పరామర్శించారు.

• ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

పెద్దపల్లిరూరల్: గ్రామీణ మహిళలు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని మహిళా సాధికారిత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ, జెండర్ స్పెషలిస్టు స్వప్న, సంధ్య అన్నారు. పెద్దపల్లి మండలం పెద్దకల్వలలో బుధవారం గ్రామీణ మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మహిళల కోసం అమలవుతున్న పలు పథకాలపై అవగాహన కల్పించారు.

• అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

గోదావరిఖనిటౌన్: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అనుమతి లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం కోరారు. రామగుండం మండల విద్యాధికారి గడ్డం చంద్రయ్యకు బుధవారం ఆయన వినతిపత్రం అందజేశారు. పారిశ్రామిక ప్రాంతంలోని కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అనుమతి లేకుండా కొన్ని పాఠశాలలు కొనసాగుతున్నాయని, అలాంటి పాఠశాలలపై విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు గొడిసెల ప్రణీత్ పాల్గొన్నారు.

• నేడు ఆదర్శ విద్యాలయంలో ఇంటర్వ్యూ

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ ఆదర్శ విద్యాలయంలో హిందీ పండిట్, అర్థశాస్త్రం బోధించేందుకు గంటల ప్రాతిపదికన ఎంపిక కోసం గురువారం ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎండీ షాదుల్ తెలిపారు. అర్థశాస్త్రం బోధించే అభ్యర్థులు ఎంఏ అర్థశాస్త్రంతో పాటు బీఈడీ, హిందీ బోధించడానికి ఎంఏ హిందీతో పాటు హెచ్‌పీటీ అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు 17న ఉదయం ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో ఆదర్శ విద్యాలయంలో హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.



జూలపల్లి: మండలంలోని నాగులపల్లె నుంచి భూపాలపట్నం వెళ్లే రోడ్డు వర్షాలకు కొట్టుకుపోయి పెద్ద గుంతపడి ప్రమాదకరంగా మారింది. రాత్రివేళల్లో గుంత కనిపించక అందులో పడిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీరాజ్ అధికారులు వెంటనే ప్రమాద సూచికబోర్డు ఏర్పాటు చేసి, రోడ్డు మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మా ఫోన్ నంబర్: 98499 71500

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

సింగరేణి వార్తలు

భద్రతతో కూడిన ఉత్పత్తి సాధించాలి



పనులను పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్, డైరెక్టర్ పా జి.వెంకటేశ్వర్‌రెడ్డి

రామగిరి: నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి, బొగ్గు రవాణా చేయడానికి భద్రతతో కూడిన ఉత్పత్తి సాధించాలని ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్, డైరెక్టర్ పా జి.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆర్జీ-3 డివిజన్‌లోని ఓసీపీ-2 గనిని బుధవారం ఆయన సందర్శించారు. వ్యూ పాయింట్ నుంచి పనులను పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, ఓబీ లక్ష్యాల అంశాలపై చర్చించారు. నిర్దేశించిన బొగ్గు రవాణా చేయడానికి అనుగుణంగా కృషి చేస్తూ భద్రతతో కూడిన లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఉపరితల గనుల్లో వర్షాకాలంలో తప్పకుండా జాగ్రతలు పాటించాలని, లక్ష్యాలను సాధించడంలో తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. గనిలో తీసుకుంటున్న భద్రతా చర్యల గురించి ఆర్జీ-3 జీఎం ఎస్.సుధాకర్‌రావు డైరెక్టర్‌కు వివరించారు. ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి జె.రాజశేఖర్, ఎస్టేట్ అధికారి ఐలయ్య, డిప్యూటీ మేనేజర్ శ్రీనివాస్, సర్వే అధికారులు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఓవర్‌మెన్‌లకు వెబ్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌కు హాజరైన ఓవర్‌మెన్‌లు

గోదావరిఖని: స్థానిక టీటీసీలో ఓవర్‌మెన్‌లకు బుధవారం వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆర్జీ-1 ఏరియా జీడీకే-1, 3, 2, 2ఏ, 11 గనుల్లో పనిచేస్తున్న ఓవర్‌మెన్‌లకు ఓసీపీల్లోకి విధులు నిర్వహించేందుకు వెబ్ కౌన్సెలింగ్ ఏర్పాటు చేశారు. కౌన్సెలింగ్‌కు 54 మంది దరఖాస్తు చేసుకోగా 51మంది హాజరయ్యారు. కార్యక్రమానికి ఆర్జీ-1 కమిటీ సభ్యులు ఆంజనేయప్రసాద్, ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం ముఖ్య అతిథిగా హాజరై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

గోదావరిఖని: సింగరేణి పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఉపాధి శిక్షణ ఇస్తున్నట్లు ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ తెలిపారు. డ్రైవాల్ అండ్ ఫాల్స్ సీలింగ్ టెక్నీషియన్, వెల్డింగ్ అండ్ ఫ్యాబ్రికేషన్ టెక్నీషియన్, ఆటోమొబైల్ అండ్ టూ వీలర్ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వీరిని ఈనెల 20న హైదరాబాద్ పంపించనున్నట్లు చెప్పారు.

సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

రామగిరి: ఆర్జీ-3, ఏపీఏ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు బుధవారం జీఎం ఎస్.సుధాకర్‌రావు ఆదేశాల మేరకు క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. 185 ఖాళీ క్వార్టర్లు ఉండగా ఫ్రెష్ అలాట్‌మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ కోసం 69మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని ఆర్జీ-3 ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి తెలిపారు. 27మంది ఉద్యోగులు హాజరై 25 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారని, వారికి త్వరలోనే అలాట్‌మెంట్ లెటర్స్ ఇస్తామని పేర్కొన్నారు. పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం, డీపీఎం గుర్రం శ్రీహరి, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి, ఐఎన్‌టీయూసీ ఆర్జీ-3 డివిజన్ ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, క్వార్టర్ల విభాగం సిబ్బంది రమ్య, సదయ్య పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో ఇంకుడుగుంతల నిర్మాణం



కమాన్‌పూర్: మండలంలోని గుండారంలో సింగరేణి సంస్థ ఆర్జీ-3 ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడానికి గురువారం పనులు ప్రారంభించారు. గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, హనుమాన్ ఆలయంతో పాటు ప్రధాన రహదారి వెంట ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టనున్నారు. సుమారు రూ.లక్ష నిధులతో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిసింది.

ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించాలి

పాలకుర్తి: రైతులు ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ కోరారు. మండల పరిధిలోని ఈసాలతక్కళ్ళపల్లిలో బుధవారం మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పాం సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ఆయిల్‌పామ్‌కు బహిరంగ మార్కెట్‌లో మంచి ధర ఉందని, రైతులకు సబ్సిడీపై మొక్కలతో పాటు డ్రిప్ పరికరాలను ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు. ఏఈవోలు శశిధర్, యోజన, ఆయిల్‌పాం ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

స్వాములకు పండ్లు పంపిణీ

సుల్తానాబాద్: మంథని నివాసులు పాదయాత్రగా అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్తుండగా సుల్తానాబాద్‌లో సేద తీరారు. బుధవారం సుల్తానాబాద్‌కు చెందిన భక్తులు అయ్యప్ప ఆలయ పూజారి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో పండ్లు, అల్పాహారం సమకూర్చారు.